
# పరాకాష్ఠ

డా॥ గాయత్రీదేవి



అనగనగా ఓ వ్యాపారి. పేరు జాకీ మంచి బిజినెస్ మేనేజర్. ఎంట్రన్స్‌లలో రాంకులు సంపాదించి ఐఐఎమ్ లలో చేరి ఎమ్‌బిఎ చేసిన వాడు కాదు. కనీసం అల్లాటప్పా కాలేజీలో చేరి డిగ్రీ పుచ్చుకున్న వాడూ కాదు. పదో తరగతి ఫస్టు క్లాసులో కాదు వాయిదాల పద్ధతిలో పాసయినవాడు. అయినా మాంచి బిజినెస్ మేనేజర్. వ్యాపార కళ వంశపారంపర్యంగా వచ్చిందను కుంటే పొరపాటే. అతడి వంశంలో అటు ఏడు తరాల ముందు కానీ ఇటు ఏడుతరాల ముందు కానీ ఎవ్వరూ వ్యాపారం చేసి ఎరగరు. జాకీకి వ్యాపారం విద్య పూర్వజన్మ ఫలం అని ప్రజలు అనుకుంటూంటారు. జాకీ నోట్లో వెండి చెంచాతో పుట్టిన వాడనీ, ఐరన్ లెగ్గుతో కాక బంగారు పాదంతో పుట్టాడనీ కూడా అను కుంటూంటారు.

సబ్బు బిళ్ళా అగ్గిపుల్లా కాదేదీ కవితకనర్హం అని కవులు అనుకుంటూంటే నిప్పూ నీళ్ళూ, చెట్టూ చేమా, రొయ్యలూ చేపలూ, మట్టి స్నానం, తొట్టి స్నానం, విద్యావైద్యం కాదేది బిజినెస్ కనర్హం అంటాడు జాకీ. దేనితోనయినా వ్యాపారం చేస్తాడు. విజయవంతంగా నిర్వహిస్తాడు. విపరీతంగా లాభాలూ గడిస్తూంటాడు.

వెరైటీ కావాలి జాకీకి. మూసలో పోసినట్లు ఒకే రకం వ్యాపారాలు చెయ్యడు. కొత్త కొత్త వ్యాపారాలు కనిపెడ్తూంటాడు. ఏ ఒక్క వ్యాపారాన్ని ఎక్కువ రోజులు చెయ్యలేడు. కొత్త వ్యాపారాల కోసం వెతుక్కునే వారికి, కొత్తగా వ్యాపారంలోకి దిగే వారికి జాకీ మార్గదర్శి. అతణ్ణి అనుసరించే రకరకాల వ్యాపారాలు విజయవంతంగా చేసిన వారెందరో.

డబ్బు గడించవచ్చు అనుకుంటే దేనితోనయినా వ్యాపారం చేస్తాడు, జాకీ. లేటెస్ట్‌గా వైద్యం తోటీ, విద్యతోటీ వ్యాపారాలు చేశాడు. ఆరోగ్యం పేరు మంచి వ్యాపార వస్తువు అని గ్రహించాడు. తను వైద్యుడు కాక పోయినా రకరకాల మొండి జబ్బులకి చైనా జపాను టిబెట్టుల స్పెషల్ ట్రీట్మెంట్లు చేయిస్తానంటూ హాస్పిటళ్ళు పెట్టి పెద్ద ఎత్తున వ్యాపారం చేశాడు. వీలయినంతా దండుకున్నాడు. ఆరోగ్య విపణికి లీడర్ అయ్యాడు

చదువంటే తనకి ప్రీతి అంటూ కోచింగ్ సెంటర్లు మొదలెట్టాడు తన ఇన్స్టిట్యూట్ లో చదువుకునే విద్యార్థుల ప్రతిభ కంటే పేపర్లలో ఆకర్షణీయమయిన ప్రకటనలు ఇవ్వడమే ప్రధానం, అనే ఆలోచనకి ఆద్యుడు జాకీయే. స్వయం ప్రతిభతో మంచి మార్కులు సంపాదించుకున్న వారితో బేరం కుదుర్చుకుని వాళ్ల ఫోటోలు తీసుకుని తమ సంస్థలో చదవడం వల్లనే విజయం సాధించారంటూ ఫుల్ పేజీ ప్రకటనలు తయారు చేయించి దినపత్రికల్లో ఇచ్చాడు. ఈ వ్యాపార రహస్యాలు తెలియని అమాయక ప్రజలు తండోపతండాలుగా తమ పిల్లల్నీ, లక్షల కొద్దీ డబ్బునీ తెచ్చి జాకీ చేతిలో పెట్టేశారు.. జాకీ వ్యాపారం విపరీతంగా పెరిగింది. వ్యాపారస్థులంతా విద్యా వ్యాపారంలోకి దిగిపోయారు.

అటువంటి జాకీ ప్రస్తుతం కొత్త వ్యాపారం కోసం కొత్త ఆలోచనలలో ఉన్నాడు.

అనగనగా ఒక విద్యార్థి పేరు చేతక్. చదువంటే మహా మక్కువ. అతని చదువుని కొలిచే మార్కులూ ఎక్కువే. చదువుకోవడం అంటే ఆనందం. విజ్ఞానం సంపాదించడం అంటే ఉత్సాహం. తరగతిలో చేతక్ పీట్లలో ఉన్న టెండూల్కర్. సాఫీగా సాగిపోతున్న చేతక్ విద్యార్థి జీవితం పదో తరగతిలోకి అడుగుపెట్టగానే పాట్లకి నిలయమయ్యింది.

''మా వాడు టెన్త్‌లోకి వచ్చిన దగ్గర్నుంచీ వాడి కంటే నాకే ఎక్కువ టెన్షన్‌గా ఉంది. పరీక్షలు ఎలా రాస్తాడో ఏ ర్యాంకు తెచ్చుకుంటాడో'' చేతక్ తండ్రి.

''నీకు టెన్షన్ ఎందుకోయ్. మీ వాడు స్టేట్ ఫస్ట్ వస్తాడు. గ్యారంటీ'' తండ్రి స్నేహితుడు.

''అవునవును. స్టేట్ ఫస్ట్ గ్యారంటీ. వెయ్యి రూపాయలు పందెం'' మరో స్నేహితుడు.

''ఛ, వెయ్యేంటి, నేను రెండువేలు పందెం కాస్తా, మీ వాడే స్టేట్ ఫస్ట్'' మరో మిత్రుడు.

తన మిత్రుల మాటలు కొడుకుతో గర్వంగా చెప్పాడు చేతక్ తండ్రి.

''మీ వాడికి స్టేట్ ఫస్ట్ వస్తుంది. నువ్వు నాకు ఓ మాంచి పట్టు చీర బహుమతిగా ఇవ్వాలి సుమా'' చేతక్ తల్లి స్నేహితురాలు.

''మీ వాడికి స్టేట్ ఫస్ట్ గ్యారంటీ. నాకు పట్టు చీర వద్దు మాంచి డిజైనర్ చీర కొని పెట్టాలి'' మరో స్నేహితురాలు.

స్నేహితురాళ్ల మాటలు చేతక్‌కి చేర వేసింది తల్లి. ఊళ్ళో ఉన్న వాళ్ళూ, పొరుగూళ్ల వాళ్ళు అంతా వ్యక్తిగతంగానో, ఫోన్ల ద్వారానో ఎస్ఎమ్ఎస్‌ల ద్వారానో చేతక్‌కి స్టేట్‌ఫస్ట్ వస్తున్నట్టు సంభాషణ. మరోపక్క కోచింగ్ సెంటర్ల వాళ్ళు చేతక్ తండ్రి వెంట పడ్డం మొదలెట్టారు చేతక్ పేరుని తమ ఇన్స్టిట్యూట్ ప్రకటనలో వేసుకుంటామంటూ బేరాలు పెట్టడం మొదలు పెట్టేశారు.


చేతక్ కబురు ఆ నోటా ఈ నోటా జాకీని చేరింది. చేతక్‌లో జాకీకి మంచి వ్యాపారం కనబడింది. కొత్త వ్యాపారం. పోటీలేని వ్యాపారం.

ఒకటో తారీఖున చేతక్ తండ్రి స్నేహితులని, తల్లి స్నేహితురాళ్ళనీ కలిశాడు జాకీ.

''మీలో మీరు చేతక్‌కి రాబోయే స్టేట్ ఫస్ట్ గురించే పందేలు వేసుకుంటే, అందులో ఏం మజా ఉంది? ఏం లాభం ఉంది? చేతక్‌కి రాబోయే మార్కుల మీద నా దగ్గర పందాలు కట్టండి. నేను మీకు పదిరెట్లు ఇస్తాను'' జాకీ.

శ్రోతలకి ఉత్సాహం ఉప్పొంగింది. ''ఏమిటేమిటి సవివరంగా చెప్పు'' అన్నారు ఏకగ్రీవంగా.

''చేతక్‌కి స్టేట్ ఫస్ట్ వస్తుందని మీరెవరయినా నా దగ్గర వంద రూపాయలు కడితే, ఆ కుర్రాడికి స్టేట్ ఫస్ట్ రాగానే వందకి పది రెట్లు అంటే వెయ్యి రూపాయలు అక్షరాలా వెయ్యిరూపాయలు నేను మీకు ఇస్తాను. సిటీ ఫస్ట్ వస్తాడని పందెం కట్టే వాళ్లకి కట్టిన డబ్బుకి అయిదు రెట్లు ఇస్తాను. అదే స్కూల్ ఫస్ట్ వస్తాడని కట్టే వాళ్లకి రెండు రెట్లు ఎక్కువ డబ్బు ఇస్తాను. మీలో ఎవరెవరు కడతారో రండి. రండి బాబూ రండి. కనీవినీ ఎరుగని కొత్త పోటీ'' అంటు జాకీ నిజాయితీగా బిల్లు పుస్తకం పట్టుకుని నిలబడ్డాడు.




ప్రతివాళ్లూ వెయ్యికి తక్కువ కాకుండా, మూడు రకాల పందాల మీదా డబ్బు పెట్టారు. చేతిలో ఉన్న డబ్బుని మరో ఆలోచన లేకుండా పందెంలో పెట్టేశారు కొందరు. చేతిలో సొమ్ములేని వాళ్ళు పరిగెత్తుకెళ్లి ఏటిఎమ్‌లలోంచి తెచ్చేశారు.

అప్పులు చేసేశారు కొందరు. నగలు తాకట్టు పెట్టేశారు మరి కొందరు. జాకీ చేతిలో ఉన్నబిల్లు పుస్తకం చాల లేదు.


వార్త దావానంలా ఊరంతా వ్యాపించి పోయింది.

జనం తండోపతండాలుగా వచ్చి చేతక్ మీద పందెం కాశారు. జాకీ చతిలో డబ్బు పోశారు.

***

చేతక్ ఏ నిమిషంలో ఏం చెయ్యాలో ప్రజలే నిర్ణయించేశారు.

ఉదయం నాలుగు గంటల నుండి 8గంటల వరకూ ట్యూషను, ఎనిమిది గంటల నుండి నాలుగు గంటల వరకూ స్కూలూ, ఆ తరవాత నాలుగు గంటల పాటు స్కూల్లోనే స్టడీ అవర్లూ,




మళ్లీ రెండు గంటలు ట్యూషనూ అన్ని అయ్యి రాత్రి పది గంటలకి ఇల్లు చేరి, పన్నెండింటి వరకూ మళ్ళీ చదువు.

చేతక్ ఏ నియమమూ తప్పడానికి వీలు లేదు. అయా సమయాలకి అన్నీ సరిగ్గా చదువుతున్నాడా లేదా గమనించడానికి వంతుల వారీగా డ్యూటీలు వేసుకున్నారు కొందరు.

చేతక్ శక్తి తగ్గిపోకుండా టానిక్‌లు తాగించే వారు కొందరు.

చదివింది మరిచిపోకుండా మెమరీ మందులు వేసేవారు కొందరు.

బాబాల దగ్గర్నుంచి విభూదులు తెచ్చిపెట్టే వారు కొందరు.

నెలనెలా జరిగే యూనిట్ టెస్ట్‌ల మార్కులు రాగానే కాపీలు తీయించి చేతక్ మీద డబ్బు పెట్టిన వారందరికీ పంచి పెట్టే ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు రిపోర్టు చూసేవరకూ అందరికీ టెన్షన్.

"చేతక్ నీ మీద అయిదు వేలు పందెం కట్టా. నువ్వు స్టేట్ ఫస్ట్ రావాలి, నాకు యాభైవేలు ఇప్పించాలి".

"చేతక్ నువ్వు డిస్ట్రిక్ ఫస్ట్ రావాలి, నేను నీ మీద నాలుగు వేలు కట్టా నాకు ఇరవై వేలు ఇప్పించే భారం నీదే".

"చేతక్ నేను మా ఆవిడ గాజులు తాకట్టు పెట్టి మరీ పందెంలో పెట్టా. మీ ఆంటీ గాజులు విడిపించకపోయానంటే ఆంటీ నిన్నే చితక్కొడ్తుంది జాగ్రత్త".

"నువ్వు తప్పకుండా స్టేట్ ఫస్ట్ వస్తావు. ఆంజనేయస్వామిలా నీ శక్తి నీకు తెలియదు కానీ నిక్షేపంలా ఫస్ట్ వస్తావు. నేను పెట్టిన పదివేలకి లక్ష ఇప్పిస్తావ్. నాకు తెలుసుగా నీ శక్తి.

"మా పరువు నిలబెట్టే బాధ్యత నీదే" తల్లి తండ్రులు.

నిత్యం చేతక్ చెవిలో ఈ మాటలే గింగురుమంటున్నాయి.

ఆ కుర్రవాడి పరిస్థితి అస్తవ్యస్తంగా తయారయ్యింది. చదువుకోవడంలో ఇన్నాళ్ళూ పొందిన ఆనందం పూర్తిగా పోయింది. పుస్తకం చూస్తే గుండెదడ. రాత్రి నిద్ర పట్టదు. పగలు బుర్ర పనిచెయ్యదు. కళ్ళు మూసినా తెరిచినా మార్కులే దయ్యాలలా కనబడి వెంట పడుతున్నాయి.

***

ఆగని కాలం సాగింది. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడ్డాయి. చేతక్ మరీ పరధ్యానంగా తయారయ్యాడు. పీడకలలు ఎక్కువయ్యాయి. స్టేట్ ఫస్ట్ వచ్చినట్లు ఒక రోజు, రానట్లు మరో రోజూ కలలూ కలత నిండిన మనసూ.

పరీక్షలు ముగిశాయి.

ప్రజలకి నిద్రలేదు. పీడకలలు కనడం వారి వంతయ్యింది. చేతక్ కి స్టేట్ ఫస్ట్ వచ్చినట్లూ, తను లక్షాధికారి అయినట్లూ కల కంటాడు, ఒకడు. చేతక్ కి ర్యాంకు రానట్లూ భార్య గాజులు విడిపించలేక పోయినట్లూ భార్యతో యుద్ధం జరుగుతున్నట్లూ కల మరొకరికి.

నవ్వుతూ నిశ్చింతగా ఉన్నవాడు జాకీ ఒక్కడే.

"ఏమండీ, టెన్త్ రిజల్ట్స్ రెండు రోజుల్లో వచ్చేస్తాయట. చేతక్ మీద పందాలు కట్టిన వారందరికీ డబ్బు ఎక్కణ్ణించి తెచ్చిస్తారు? మీరిన్నేళ్లలో సంపాదించినదంతా అమ్మినా అంత డబ్బు రాదు కదా! చేతక్ స్టేట్ ఫస్ట్ వచ్చేస్తాడని అందరూ గట్టిగా అంటున్నారు" జాకీ భార్య.

"ఓసి వెర్రి మొహమా! ఇన్నేళ్ళలో నేను ఏ నాడయినా ఏ వ్యాపారంలోనయినా తెలివితక్కువగా పోగొట్టుకున్నానా? చేతక్ స్టేట్ ఫస్ట్ కాదు స్కూల్ ఫస్ట్ కూడా రాడు. ఆ కుర్రాడి మీద లక్షలు పందాలు కట్టారు చిన్న పిల్లాడికి ఆటా పాటా సరదాలూ లేకుండా చేశారు. నువ్వు ఫస్ట్ రాకపోతే మాకు ఇంత నష్టం ఇంతనష్టం అని నిమిషం శాంతిగా ఉండనిచ్చారా? వాళ్ళ అమ్మానాన్న అయినా ఈ విషయం గురించి ఆలోచించలేదు. ఇంత టెన్షన్ పెట్టాక పరీక్షలు బాగా రాసేఛాన్సే లేదు. ఆ పిల్లాడికి ఏ రాంకూ రాదు.

ఇన్నేళ్ళలో రకరకాల వ్యాపారాలు చేసి సంపాదించిన దాని కంటే ఈ కుర్రాడి మీద పందేల వ్యాపారంలో అతి తేలికగా సంపాదించా. ఇప్పుడీ కొత్త వ్యాపారానికి ఊరూరా నెట్ వర్క్ ఏర్పాటు చేశా. ఒక్కొక్క ఊళ్ళో ఒక్కొక్కడి మీద పందేలు కట్టిస్తున్నా. ఇక మనకి కోట్లే కోట్లు".

"అయ్యో పాపం మీ వ్యాపారానికి చదువుకునే పిల్లల్ని బలి చేస్తారా?"

"వ్యాపారంలో డబ్బే కానీ అయ్యో పాపాలు ఉండవులేవే వెర్రిమొహమా".

★